క్లుప్తంగా

కాలేరులో ఆరోగ్య సురక్ష శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కరుణేంద్రకుమారి ఆధ్వర్యంలో కాలేరు, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన రోగులకు చికిత్స అందించారు. ఆలమూరు సీహెచ్‌సీ వైద్యులు అఖిలాష్, కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వైద్యులు శ్రావణి వైద్య సేవలందించారు. మోటారు వాహనంపై నిచ్చెనను తీసుకెళ్తూ అచ్యుతాపురం గ్రామానికి చెందిన వ్యక్తి పడిపోయాడు. నిచ్చెన విద్యుత్ స్తంభానికి తగలడంతో కిందపడి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని ఆరోగ్య సురక్ష శిబిరానికి తరలించగా, వైద్యులు చికిత్సనందించారు. మెరుగైన వైద్యం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

302 మందికి వైద్య సేవలు



కుందూరు వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

కె.గంగవరం: మండలంలోని కుందూరులో మంగళవారం ప్రభుత్వ వైద్య శిబిరం నిర్వహించారు. పేకేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీలక్ష్మి, ఈఎస్‌టీ వైద్యుడు డాక్టర్ మోహన్‌బాబులు 302 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులను అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన ముగ్గురిని పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్య సిబ్బంది వైద్య సహకారం అందించారు.

డీఏ పెంచుతూ ఉత్తర్వుల జారీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ క్యాజువల్ లేబర్‌కు డీఏను పెంచుతూ ఆర్థికశాఖ కార్యదర్శి ఎస్.శివకుమార్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు ఇప్పటికే రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను 46 శాతం నుంచి 50 శాతం వరకూ పెంచారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఈ డీఏ అమల్లోకి వస్తుందన్నారు. రూ.13,140 ఉన్నవారికి ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి రూ.13,500 వస్తుందన్నారు. ఈ మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

డిపార్ట్‌మెంట్ టెస్ట్‌ల్లో పారదర్శకత లోపించింది

సిటింగ్ ఎంపీ వైతిలింగం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో వివిధ ప్రభుత్వ శాఖల్లో యూడీసీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పారదర్శకత లోపించిందని సిటింగ్ ఎంపీ వైతిలింగం ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. కొంతమంది జూనియర్లు సైతం పదోన్నతి పొందారన్నారు. మొత్తం పదోన్నతి ప్రక్రియకు సంబంధించి మెరిట్‌జాబితా, మార్కులు సైతం పబ్లిష్ చేయాలని, లేదంటే తాము సీబీఐ విచారణ కోరతామన్నారు. గత మూడేళ్ల బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ కూటమిలో పాలన సరిగా లేదన్నారు.


ఐఎఫ్ఎస్ అధికారి పర్యటన



మడ అడవులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

యానాం: పుదుచ్చేరి కన్జర్వేషన్ ఫారెస్ట్ అధికారి అరుళ్‌రాజన్ మంగళవారం యానాంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా యానాం సరిహద్దుల నిర్ణయంతో పాటు గౌతమీగోదావరి నదీ ముఖద్వారంలో ఉన్న మాంగ్రూవ్ ఫారెస్ట్ ద్వారా ఎకో టూరిజమ్ అభివృద్ధికి గల అవకాశాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన యానాం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక బోటులో వెళ్లి గోదావరిలో మడఅడవులను పరిశీలించారు. అర్బన్ ప్లానిటేషన్‌కు గల అవకాశాలను గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్, వ్యవసాయ అధికారి జోగిరాజు, ఫీల్డ్ సిబ్బంది ఖాన్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10,101 విరాళం



దాత శ్రీనివాసరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ లక్ష్మీనారాయణ

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన ట్రస్టు కోసం గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.10,101 విరాళం ఇచ్చారు. సదరు మొత్తాన్ని ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

సంక్షేమ పాలనకే మొగ్గు!

- ఓటరు తీర్పు వైఎస్సార్ సీపీకే అనుకూలం
- పార్టీ శ్రేణుల్లో ఆశలు పదిలం
- మండపేట నియోజకవర్గంలో 87.06 శాతం పోలింగ్
- పెరిగిన పోలింగ్ ప్రభుత్వ అనుకూలమేనంటున్న విశ్లేషకులు



అంగర పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు

కపిలేశ్వరపురం: ప్రజా తీర్పు ఈవీఎం యంత్రంలో పదిలమైంది. ఫలితాల వెల్లడికి జూన్ 4 వరకూ సమయముంది. ఈలోగా మండపేట నియోజకవర్గంలో ఫలితం ఎటువైపు అన్న చర్చోపచర్చలు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సాగుతున్నాయి.

2019 ఎన్నికల్లో 153 సీట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి సంపూర్ణ తీర్పును ఇచ్చిన ప్రజలు, ప్రస్తుత ఎన్నికల్లో మరింత స్పష్టమైన తీర్పు ఇవ్వనున్నారన్న విశ్వాసం పార్టీ శ్రేణుల్లో బలంగా ఉంది. నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై ఈ కథనం.

ప్రాధాన్యమున్న నియోజకవర్గం

మండపేట నియోజకవర్గం మూడు సార్వత్రిక ఎన్నికల నుంచి పెత్తందారీతనం మాటున నలిగిపోతోంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఈ నియోజకవర్గానికి కో–ఆర్డినేటర్‌గా నియమించిన నాటి నుంచీ, క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా త్రిమూర్తులునే ఆశ్రయిస్తున్నారు. ఆయన చొరవతో ఎలాంటి సమస్యలనైనా క్షణాల్లో పరిష్కరించడంతో నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో ఆయనపై భరోసా ప్రజలకు దక్కింది. ఆ ఆదరణే ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్సీ తోటను గెలిపిస్తుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు నమ్ముతున్నారు.

మహిళా ఓటర్ల మొగ్గు ఇటువైపే..

సోమవారం ఉదయం ఏడు గంటలు నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు బారులు తీరి ఉన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ క్యూలో మహిళా ఓటర్లు అదే ఉత్సాహాన్ని చూపుతూ ఓటు వేశారు. ఐదేళ్లలో కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పొందిన లబ్ధికి ప్రతిబింబమే మహిళా ఓటర్ల ఉత్సాహమని వైఎస్సార్ సీపీ శ్రేణులు విశ్వసిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో 1,13,263 మంది మహిళా ఓటర్లు ఉండగా, 97,735 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కూటమి కుయుక్తులకు సమాధానం

మండపేట నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 12.36 శాతం 11 గంటలకు 28.66 శాతం, మధ్యాహ్నం 1 గంటలకు 45.70, మధ్యాహ్నం 3 గంటలకు 61.35, సాయంత్రం 4 గంటలకు 66.03, ఐదు గంటలకు 76.56 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి 87.06 శాతం ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,20,494 మంది ఓటర్లకు 1,91,959 మంది ఓటు వేశారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళి రికార్డు స్థాయి సూచిస్తోంది. కచ్చితంగా ఇది ప్రభుత్వ అనుకూల ఓటింగ్ అని వైఎస్సార్ సీపీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు.

నేత్రదానంతో చిరంజీవిగా 'రవణం'



రవణం పట్టాభిరామయ్య (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని కె.గంగవరానికి చెందిన రవణం పట్టాభిరామయ్య(68) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన బావమరిది పేరాబత్తుల నాగేశ్వరరావు ప్రోత్సాహంతో కుమారుడు రవణం బాబి నేత్రదాన మోటివేటర్ సాకా భానుదుర్గాప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు ఇచ్చిన సమాచారం మేరకు టెక్నీషియన్లు జి.రవికుమార్, ఎస్.నానాజీలు వచ్చి నేత్రాలను(కార్నియాలను) సేకరించారు. నేత్రదానంతో కంటి చూపు వచ్చి చీకటి నుంచి బయటపడి లోకాన్ని చూడాల్సిన వారు లక్షల్లో ఉన్నారని అటువంటి వారిలో ఇద్దరికి తన నేత్రదానంతో చూపును ఇవ్వనున్న రవణం పట్టాభిరామయ్య చిరంజీవిగా నిలుస్తారని కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో సుమారు 346 మందికి ఉచితంగా వైద్య సేవలందించి, మందులు అందజేశారు. వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పోటెత్తిన ఓటర్లు



సోమవారం నాడు జరిగిన పోలింగ్‌లో రామచంద్రపురం పట్టణంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

- అత్యధికంగా 85.59 శాతం పోలైన ఓట్లు
- కోనసీమ జిల్లాలోనే అధికం

రామచంద్రపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఈ సారి జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు పోటీ పడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రామచంద్రపురంలో అత్యధికంగా 85.59 శాతం పోలింగ్ నమోదయింది. 2019లో 79.47 శాతం పోలవగా ఈసారి 6.12 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 2,03207 ఓట్లు ఉండగా పురుషులు 1,00682, మహిళలు 1,02524 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 1,73,917 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 87,429 మంది మహిళలు 86,487 మంది థర్డ్ జెండర్ ఒకరు తమ ఓటు వేశారు. మొత్తంగా నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 85.59 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నియోకవర్గంలోని కె.గంగవరం మండలం కోటిపల్లిలో 227 పోలింగ్ బూత్‌లో అత్యధికంగా 94.03 శాతం ఓట్లు పోలవ్వగా అత్యల్పంగా రామచంద్రపురం పట్టణంలోని చప్పిడివారి సావరంలోని 22 నంబర్ బూత్‌లో 70.27 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలోని 239 పోలింగ్ బూత్‌లలో 85.59 శాతం పోలింగ్ నమోదయినట్లు ఆర్వో ఎస్.సుధాసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ అవడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. ఎవరి లెక్కల్లో వారున్నారు. అధిక శాతంలో మహిళలు, వృద్ధులు పోలింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తుంది. రామచంద్రపురం అర్బన్‌లో కూడా ఈ సారి అధిక శాతం పోలింగ్ నమోదయింది. దాదాపుగా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో 82.15 శాతం వరకు పోలింగ్ అయింది. పట్టణంలో అటు సాధారణ ఎన్నికల్లోగానీ, మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ గతంలో ఎప్పుడు ఈ విధంగా పోలింగ్ నమోదు కాలేదు. సోమవారం ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్న ఓటర్లు సాయంత్రం వరకు కూడా ఓటు వేసేందుకు అదే ఒరవడి కొనసాగించారు. కాగా రామచంద్రపురం పట్టణంలోని బ్రాడీపేట, కొత్తూరు పోలింగ్ బూత్‌లలోను, కాజులూరు మండలం గొల్లపాలెం, కోలంక, కె.గంగవరం మండలం శివల తదితర పోలింగ్ బూత్‌ల వద్ద రాత్రి 9 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. కాగా పోలింగ్ అనంతరం రామచంద్రపురం పట్టణంతో పాటుగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లోను ఈవీఎంలను ఎన్నికల అధికారులను రాత్రి 10 గంటల తరువాత బస్సుల్లో అమలాపురం సమీపంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. మొత్తం 239 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 42 రూట్‌ల నుంచి బస్సులను ఇతర వాహనాల ద్వారా అర్ధరాత్రి దాటిన తరువాత వరకు కూడా వెళుతూనే ఉన్నాయి.

అధిక శాతం పోలింగ్‌పై ఉత్కంఠ

నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక శాతం పోలింగ్ నమోదు కావటంతో ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ అనంతరం బూత్‌లవారీగా పోలింగ్ శాతాన్ని అంచనా వేస్తు విజయావకాశాలపై బేరీజు వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు నాడు ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

గంటలకొద్దీ నిలబడి..
ఓటేసిన పండుటాకులు

రాయవరంలో 87.11 శాతం పోలింగ్



రాయవరంలో పోలింగ్‌కు బారులు తీరిన ఓటర్లు

రాయవరం: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఉదయం ఏడు నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడ్డారు. మండలంలో 53,108 మంది ఓటర్లు ఉండగా, 46,267 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహిళలు, వృద్ధులు సైతం గంటలకొద్దీ లైన్లలోనే నిల్చుని ఓట్లు వేయడం గమనార్హం. మండలంలోని పోలింగ్ సరళిని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. మండలంలో అత్యధికంగా నదురుబాదలో 93 శాతం పోలింగ్ జరగ్గా, అత్యల్పంగా చెల్లూరులో 84.36 శాతం ఓటింగ్ జరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 87.11 శాతం ఓటింగ్ జరగడంతో అన్ని వర్గాల్లో ఆనందం నింపింది. కురకాళ్లపల్లి పోలింగ్ కేంద్రంలో రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్ కొనసాగినా, మహిళలు వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధుల ఓట్లు కీలకం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. అధికారుల ప్రాథమిక సమాచారం మేరకు మండలంలో 12 గ్రామాల్లో ఓటర్లు పోలైన ఓట్లు శాతం ఇలా ఉంది.

గ్రామం	పురుషులు	స్త్రీలు	పోలైనవి
రాయవరం	2,820	2,830	5,650
లొల్ల	460	590	1,050
వి.సావరం	998	1,173	2,171
నదురుబాద	424	400	824
సోమేశ్వరం	3,129	3,062	6,191
మాచవరం	3,107	3,161	6,268
వెదురుపాక	1,921	2,005	3,926
పసలపూడి	2,852	2,929	5,781
చెల్లూరు	3,683	3,699+1	7,383
వెంటూరు	2,044	2,091	4,135
కూర్మాపురం	885	865	1,750
కురకాళ్ళపల్లి	579	560	1,139
మొత్తం	22,902	23,365	46,267

చేలకు నిప్పు... రైతుకు ముప్పు

- నశించిపోతున్న ఉపయోగకర సూక్ష్మజీవులు
- విద్యుత్ వైర్లకు పొంచి ఉన్న ప్రమాదం
- అవగాహన లేమే కారణమంటున్న వ్యవసాయాధికారులు



చేలల్లో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది. సహకరిస్తున్న స్థానికులు (ఫైల్)



కాలిపోతున్న ధాన్యపు రాశుల్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్న రైతు కుటుంబీకులు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వరి పంట కోతలు మొదలయ్యాయి. కోత మెషీన్ల పుణ్యమా అని వరి కోతలు త్వరగా పూర్తవుతున్నాయి. అయితే కొంత మంది రైతులు అవగాహన రాహిత్యంతో కోత మెషీన్ల వల్ల చేలల్లో మిగిలిపోయిన గడ్డికి నిప్పు పెడుతుండటంతో మిగిలిన రైతులకు శాపంగా మారుతోంది. వారు మా చేలో గడ్డికి నిప్పు పెట్టుకుంటున్నాం అని అనుకుంటున్నారు. కానీ అది భగభగలాడుతున్న ఎండకు ఒక చేను నుంచి మరో చేనుకు పాకుతూ ధాన్యం నిలువ చేసిన రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. తమ పొలాల్లో, చేల గట్లమీద నిల్వ చేసిన ధాన్యం రాశులకు ఎక్కడ నిప్పు అంటుకుంటుందోనని నానా హైరానా పడాల్సి వస్తుంది. ఉరుకులు పరుగుల మీద తమ ధాన్యపు రాశులను కాపాడుకోవడానికి బకెట్లు, బిందెలతో నీళ్లతో తడుపుకుంటూ నానా ప్రయాస పడాల్సి వస్తుంది. మరోపక్క ఫైర్ సిబ్బందికి కూడా స్థిమితం లేకుండా చేస్తున్నారు. ఒకే రోజు పలుచోట్ల రైతులు తమ పొలాల్లోని గడ్డికి నిప్పు పెడుతుండటంతో ఎటువెళ్లాలో తెలియక తలపట్టుకుంటున్నారు. అప్పటికీ రామచంద్రపురంలోని ఫైర్ సిబ్బంది ఒకచోటుకి వెళ్లినా మిగిలిన చోట్లకు మండపేట, జగన్నాథపురం ఫైర్‌స్టేషన్ల నుంచి వాహనాలను, సిబ్బందిని రప్పిస్తున్నారు. ఇలా చేలల్లో నిప్పు పెట్టడం గత ఆరేళ్ల నుంచి రైతులు మొదలు పెట్టారు. వరికోత యంత్రాలతో చేనుకోతలు అయిపోయాక మిగిలిన గడ్డిని తీయించడం ఖర్చుతో కూడుకున్న పని కావడం, గత పంటల తాలూకా కేళీలు తరువాతి పంటలో ఇబ్బందులు తలెత్తుతాయనుకోవడంతో రైతులు ఈ విధంగా చేస్తున్నారు. అయితే చేలల్లో నిప్పు పెట్టడం వల్ల పంట పొలాల భూముల్లోపలి రైతులకు మేలు చేసే సూక్ష్మ క్రిములు నశించిపోతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు పెడుతున్న నిప్పు వల్ల విద్యుత్ వైర్లకు కూడా డ్యామేజీ జరుగుతుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. గతంలో చేలల్లో నిప్పు పెట్టడం వల్ల కొంతమంది రైతుల ధాన్యపు రాశులు కాలిపోయాయి. వేసవి ఎండ వల్ల ఒక్క పొలంలో పెట్టిన నిప్పు దావానలంగా పక్కచేలకు, ఆ పక్క చేలకు పాకుతూ గ్రామాలను కూడా చుట్టుముట్టే ప్రమాదం ఉందని రైతులు పొలాలకు నిప్పు పెట్టవద్దని వ్యవసాయ, విద్యుత్, ఫైర్‌శాఖల అధికారులు కోరుతున్నారు.

నియోజకవర్గం	వరి పంట ఎకరాల్లో	2022-23 సంఘటనలు	2023-24 సంఘటనలు
రామచంద్రపురం	51,600	57	42
మండపేట	46,400	34	28

నష్టమే ఎక్కువ



వరి పొలాల్లో ప్రస్తుతం నిప్పు పెట్టడం వల్ల ఉపయోగం ఏమీ లేదు. పైగా దానివల్ల నష్టమే ఎక్కువ. మట్టిలో ఉండే రైతులకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. ప్రకృతికి కూడా హాని చేసినవారవుతారు. నిప్పు పెట్టడం వల్ల విషవాయువులు వ్యాప్తి చెందుతాయి. వాతావరణంలో వేడి పెరిగిపోతుంది. కోతలు కాగా మిగిలిన గడ్డిని పొలాల్లోనే కలసిపోయేలా దుక్కు చేసుకుంటే మంచిది. లేదా గడ్డి కోసి కట్టలు కట్టే యంత్రాలు అందుబాటులోనికి వచ్చాయి. వాటిని ఉపయోగించుకుంటే పాడి రైతులకు గడ్డి అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు. అంతేకాని రైతులు ఎవరూ పొలాల్లో నిప్పు పెట్టవద్దు.

– ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, రామచంద్రపురం

తోటి రైతుల గురించి ఆలోచించండి



కొందరు రైతులు కేవలం తమ పొలంలో గడ్డికి మాత్రమే నిప్పు పెడుతున్నాం అనుకుంటున్నారు. కానీ మంటలు చాలా వేగంగా వ్యాపించి పక్క చేలల్లో నిల్వ చేసుకున్న ధాన్యపు రాశులు కాలిపోతున్న సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇప్పుడిప్పుడే రైతుల్లో అవగాహన పెరిగి వరి చేలకు నిప్పు పెట్టేందుకు దూరంగా ఉంటున్నారు. ఎవరూ ఈ పని చేయకుండా అవగాహన కల్పిస్తున్నాం. దీనిని పూర్తి స్థాయిలో నివారించాలి. ఈ విధంగా నిప్పు పెట్టడం వల్ల జరిగే మేలు ఏమీ లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నది గమనించుకుని రైతులు దయచేసి చేలల్లో నిప్పు పెట్టవద్దని కోరుతున్నాం.

– సంసాని నాగేశ్వరరావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం

సాగర తీరం.. సంధ్యా సమయం..



ఎస్.యానం గ్రామంలోని సముద్ర తీరాన సింధూర వర్ణంతో కనిపిస్తున్న భానుడు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో సముద్ర తీరాన ఉన్న ఉప్పుటేరులో సాయంత్రం సంధ్యా సమయాన భానుడు ఎర్రటి సింధూర వర్ణంలో కనిపించి మురిపించాడు. పగలంతా భగభగలతో తన ప్రతాపాన్ని చూపించిన భానుడు సాయంత్రం సమయంలో చల్లబడి ఒకవైపు నీటిలో మరోవైపు ఆకాశంలో కనిపించి చూపరులకు ఆహ్లాదం పంచాడు. వేసవి సెలవుల రీత్యా సాయంత్రం వేళలో సముద్ర తీరానికి వచ్చిన సందర్శకులను ఈ సుందర దృశ్యం ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా మంగళవారం క్లిక్‌మనిపించింది.

రావణుడిని తలదన్నే బొప్పాయి చెట్టు



మొగలిపాలెంలో 10 తలలతో పెరిగిన బొప్పాయిచెట్టు

కాజులూరు: సర్వసాధారణంగా మనిషికి, బొప్పాయి చెట్టుకి ఒకే తల ఉంటుంది. త్రేతాయుగంలో లంకాధిపతి రావణుడికి 10 తలలు ఉండేవని పురాణాలు చెబుతున్నాయి. అయితే కాజులూరు మండలం మొగలిపాలెంలో ఆనాటి రావణుడిని తలదన్నేలా ఒక బొప్పాయిచెట్టు 10 తలలు వేసింది. వాటిలో ఐదు తలలు నిండైన కాయలతో చూపరులను ఆకర్షిస్తోంది. తన పెరటిలో పెరిగిన ఈ బొప్పాయిచెట్టు మొదట్లో ఒక్క తలతోనే మొలిచిందని క్రమేపీ 10 తలలు వచ్చాయని రైతు తాడి వెంకటరెడ్డి చెబుతున్నారు. ఈ మొక్కకు ఎటువంటి రసాయన ఎరువులు వేయలేదని ఇంటిలోని చెత్త, సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునే పెద్ద పెద్ద కాయలు కాస్తుందన్నారు.